క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం గ్రామం అంతటా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. దీని కారణంగా పెనమలూరు సెంటర్, సాలిపేట, బాలాజీనగర్, వెంకటేశ్వర గార్డెన్స్, పద్మావతి గార్డెన్స్ ఫేజ్ 1,2,3, శ్రీనివాసానగర్, సీతాపురంకాలనీ, బీజేఆర్‌నగర్, హైస్కూల్, విష్ణుపురంకాలనీ, సాయినగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

కానూరులో..

కానూరులో నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారు. మహదేవపురం సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారు. దీని కారణంగా సనత్‌నగర్, తులసీనగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదు.

నేడు డయల్ యువర్ డీఎం

గన్నవరం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 23వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు గన్నవరం డిపో మేనేజర్ పి.శివాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపో నుంచి నడుపుతున్న సర్వీస్‌లకు సంబంధించి విలువైన సూచనలు, సలహాలు, సమస్యలను 8790996090 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాని సూచించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కంకిపాడు: మండలంలోని తెన్నేరు గ్రామంలో ఈనెల శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పాలన వివరిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

యువకుడు అదృశ్యంపై కేసు

పెనమలూరు: పోరంకిలో యువకుడు అదృశ్యం అవ్వటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి బ్రహ్మంగారి గుడి ప్రాంతానికి చెందిన పూల శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. అతను తాపీ పనులు చేస్తాడు. అతనికి పూల నాగసాయితేజ (22) కుమారుడు ఉన్నాడు. విజయవాడలో ఓ మాల్‌లో సేల్స్ బాయ్‌గా పని చేస్తున్నాడు. గత పది రోజుల క్రితం పని మానివేసి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ నెల 19వ తేదీన మరలా అదే షాపింగ్‌మాల్‌లో పని అడుగుతానని ఇంటి నుంచి వెళ్లాడు. అయితే అతను తిరిగి ఇంటికి రాలేదు. కుమారుడు కనిపించటం లేదని తండ్రి శ్రీనివాసరావు బంధువులు వెతుకగా నాగసాయితేజ ఆచూకీ తెలియలేదు. దీంతో తండ్రి పోలీసులు ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: అత్తింటివారిపై పోలీసులు శుక్రవారం వరకట్నం వేధింపుల కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు శ్రీ శ్రీనివాసా పద్మావతి రెసిడెన్సికి చెందిన ఇందుగుల యామిని సరస్వతి ఆదాయపు పన్ను శాఖలో పని చేస్తుంది. ఆమె 2020 సంవత్సరం అక్టోబర్ 31వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన సత్తెనపల్లి సతీస్‌కుమార్‌ను పెద్దల సమక్షంలో చేసుకుంది. పెళ్లి సందర్భంగా కట్నకానుకలు ఇచ్చారు. పెళ్లి జరిగిన తర్వాత విజయవాడలో కాపురం పెడతామని అత్తింటివారు తెలిపారు. అయితే పెళ్లి తర్వాత భర్త విజయవాడకు కాపురం పెట్టకుండా వారానికి ఒకసారి మాత్రమే వచ్చే వాడు. పైగా అదనపు కట్నం కావాలని భర్తతో పాటు అత్త సత్తెనపల్లి సత్యవతి, ఆడపడుచులు ఊటుకూరు కవిత, బండారు సత్య, బంధువు బండారు వెంకటేశ్వరరావు వేధించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేశారు.

స్వర్ణభారత్‌లో ఆటోక్యాడ్ 2డీ, 3డీ కోర్సులు

ఉంగుటూరు: ఆత్కూరులో స్వర్ణభారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్ ఆధ్వర్యాన అక్టోబర్ 5నుంచి ఆటోక్యాడ్ 2డీ, 3డీ కోర్సులు ప్రారంభించనున్నట్లు డైరెక్టర్ పరదేశి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్ క్యాడ్, ఎలక్ట్రికల్ క్యాడ్, రివిట్, స్టాడ్‌ప్రో వంటి అంశాల్లో 60 రోజుల శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ప్రవేశానికి బీటెక్, డిప్లొమా- సివిల్, మెకానికల్, ఈసీఈ ఏదైనా కనీస విద్యార్హత కలిగి 18-35 వయసు కలిగిన యువతీ, యువకులు అర్హులని వివరించారు. శిక్షణ పూర్తయిన వారికి ధ్రువీకరణ పత్రాలు, ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని వివరించారు. అభ్యర్థులు విద్యార్హత, ఆధార్, ఇన్‌కం ధ్రువీకరణ పత్రాలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో నేరుగా శిక్షణ కేంద్రం వద్ద నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 91000 33552 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తొలగనున్న తాగునీటి ఇక్కట్లు

- ఎనికేపాడులో సుమారు రూ. 3 కోట్లతో 4 వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం
- పూర్తి కావొచ్చిన 2 ట్యాంక్‌లు
- టెండర్ల దశలో మరో 2 ట్యాంక్‌లు

రామవరప్పాడు: రూరల్ మండలం ఎనికేపాడులో తాగునీటికి ఇక్కట్లు తొలగనున్నాయి. స్థానికులు తాగునీటి కోసం బోర్లపై ఆధారపడ్డారు. గ్రామంలో సుమారు 18వేల జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ కేవలం 17 మోటారు బోర్లతోనే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పాలకులు తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేదు. ఈ సమస్యలకు చెక్ పెడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా సుమారు రూ. 3 కోట్ల వ్యయ అంచనాతో 4 వాటర్ ట్యాంక్‌లను నిర్మించనున్నారు.

పూర్తి కావచ్చిన 2 వాటర్ ట్యాంక్‌లు

గ్రామంలోని 24కే కల్యాణ మండపం సమీపంలో 1.20 లక్షల లీటర్లు, బీసీ శ్మశానవాటిక సమీపంలో 60వేల లీటర్ల వాటర్ ట్యాంక్‌లను రూ.98 లక్షలతో అభివృద్ధి పరుస్తున్నారు. 1.20 లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. 60వేల లీటర్ల వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు మూడో స్లాబు దశకు చేరుకున్నాయి. త్వరగా వీటిని పూర్తిచేసి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. విజ్ఞాన్ విహార్ పాఠశాల సమీపంలోని కామన్ స్థలం 30 సెంట్లలో రూ. 1.60 కోట్లతో 2.40 లక్షల లీటర్ల సామర్థ్యమున్న వాటర్ ట్యాంక్, జెండా చెట్టు సెంటర్ సమీపంలో రూ 30లక్షల వ్యయంతో 40 వేల లీటర్ల వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు టెండర్ దశలో ఉన్నాయి.



80శాతం పనులు పూర్తి చేసుకున్న 1.20లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్



మూడో స్లాబు దశలో 60వేల లీటర్ల వాటర్ ట్యాంక్

విస్తరించనున్న వాటర్ పైప్‌లైన్‌లు

మోటారు బోర్ల ద్వారానే ఇప్పటి వరకు గ్రామంలో తాగునీటి సరఫరా చేసిన పంచాయతీ అధికారులు ప్రతి ఇంటికి తాగునీరు అందించడానికి పైప్‌లైన్ పనులను విస్తరించనున్నారు. దీనికి ఎస్సీ కాలనీలోని వాటర్ ట్యాంక్‌తో పాటు కొత్తగా నిర్మాణం పూర్తి కావొస్తున్న 1.20 లక్షల లీటర్ల ట్యాంకు, 60 వేల లీటర్ల ట్యాంకులను అనుసంధానం చేస్తూ 2వేల మీటర్ల వాటర్ పైప్‌లైన్ విస్తరణ పనులకు ప్రణాళిక రూపొందించారు. ట్యాంకుల నిర్మాణం అనంతరం ఈ పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టనున్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు



గ్రామంలో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నాం. నాలుగు వాటర్‌ట్యాంకులు నిర్మిస్తున్నాం. 2 ట్యాంకుల నిర్మాణ పనులు 80 శాతం పూర్తి అయ్యాయి. ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రత్యేక చొరవతో గ్రామంలోని రామయ్య చెరువు వద్ద తాగునీటి ప్రాజెక్టుకు డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్) నిధులు రూ. 2.16 కోట్లతో గతంలోనే అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించాం.

– రాచమళ్ల పూర్ణచంద్రరావు, సర్పంచ్, ఎనికేపాడు

క్రీడల్లో సత్తాచాటిన 'బాపులపాడు' విద్యార్థినులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలకు బాపులపాడు జెడ్పీ హైస్కూల్ నుంచి 18 మంది బాలికలు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ పామర్తి వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఇటీవల గన్నవరంలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో కబడ్డీ జట్టుకు గద్దల బ్యూలా, ఖోఖో జట్టుకు జ్యోతిక, త్రోబాల్ జట్టుకు ప్రజ్ఞా త్రినైని, వీరంకి హర్షిత, షటిల్ బ్యాడ్మింటన్ జట్టుకు వేమండ సుకన్య, బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు అక్కుపల్లి ఉమామహేశ్వరి, గొల్లపల్లి పూజిత ఎంపికైనట్లు వివరించారు. అండర్-17 బాలికల విభాగంలో కబడ్డీ జట్టుకు గొర్రెల కల్యాణి, ఖోఖో జట్టుకు శివకోటి ఉజ్వల దేవి, వాలీబాల్ జట్టుకు సిరిగుడి హారిక, బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు కడగల మైత్రి, తట్టుగోళ్ల కీర్తన, చింతల ధన్య, త్రోబాల్ జట్టుకు సిరిగురి హారిక, రామకూరి కావ్య, టెన్నికాయిట్ జట్టుకు అక్కుపల్లి ఇందు ఎంపికయ్యారని తెలిపారు. వీరంతా త్వరలో జరగబోయే ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలకు గన్నవరం నియోజకవర్గ జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు వివరించారు.



ఎంపికైన బాలికలతో బాపులపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం, పీడీ, ఉపాధ్యాయులు

భూగర్భ జలాలను సంరక్షించాలి

కంకిపాడు: భూగర్భ జల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉయ్యూరు డీఎల్‌డీఓ నాంచారరావు అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఇంకుడుగుంత తవ్వకం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వృథాగా పోతున్న నీటిని తిరిగి భూమిలోనికి పంపటం ద్వారా భూగర్భజలాల స్థిరీకరణ సాధ్యమవుతుందన్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగులకు దిశా నిర్దేశం చేశారు. సచివాలయం ద్వారా అందే సేవలను సమర్థంగా అందించాలని సూచించారు. అర్హులకు పథకాలు సక్రమంగా అందాలని, అనర్హులకు లబ్ధి చేకూరని కారణాలను పూర్తిగా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి. ఇందిర, ఈఓ బి.వెంకటేశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఈసీ నాగరాజు, సచివాలయ సిబ్బంది ప్రీతీసుధ, కిరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఇంకుడుగుంత పనులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ నాంచారరావు, ఇతర అధికారులు

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు

పెనమలూరు: పోరంకి గంగానమ్మ గుడి వద్ద శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. గంగానమ్మ గుడి వద్ద వినాయుడి పందిరి వేసి వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం వినాయకుడి సన్నిధిలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. భక్తులకు పండ్లు, నూతన దుస్తులు పంపిణీ చేశారు. కాగా శనివారం గంగానమ్మ ఆలయం వద్ద భక్తులను అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తారు. పెనమలూరు పల్లిపేటలో వరసిద్ధి వినాయక చతుర్థి మహోత్సవాలలో భాగంగా కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు. మండల పరిధిలో వివిధ గ్రామాల్లో వినాయకుడి పందిళ్లలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.



పోరంకిలో సామూహిక కుంకుమ పూజలు

జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపిక

పామర్రు: జిల్లా స్థాయిలో త్వరలో జరగబోయే యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక కార్యక్రమం స్థానిక కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో అన్ని జెడ్పీహైస్కూల్‌లకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా నియోజకవర్గ పీడీ అసోసియేషన్ కన్వీనర్ అప్పికట్ల జవహర్‌బాబు మాట్లాడుతూ యోగాలో ఒకొక్క విభాగంలో ఐదు రకాల అంశాలలో విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. అండర్-14 బాలుర, బాలికల విభాగంలో 10 మందిని ఎంపిక చేశామన్నారు. అండర్-17 విభాగం బాలుర, బాలికల నుంచి 10 మందిని ఎంపిక చేశారు. విజేతలు జిల్లా స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారు. అనంతరం విజేతలైన విద్యార్థులను హైస్కూల్ హెచ్ఎం ఏ.ఇందిరా రాణి అభినందించారు. ఈకార్యక్రమంలో పీడీలు జీ మురళీ, రవికిషోర్, దేవిరెడ్డి ఆనంద్‌రెడ్డి, పీఈటీ ఎం.గ్లాడిసన్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో హెచ్ఎం ఇందిరారాణి, పీడీలు

480 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

పామర్రు: వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు. స్థానిక ఎస్‌కే ఆర్ ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో చిన్నారులకు శుక్రవారం కంటి వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ రాంబాబు విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఈ పరీక్షల్లో 480 మంది విద్యార్థులు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 23 మందికి కళ్ల జోళ్లు అవసరమని గుర్తించారు. వీరి ఆధార్ కార్డులు, ఐడీ కార్డులను తీసుకుని ఉన్నతాధికారులకు పంపించారు. వీరికి త్వరలో కళ్లజోళ్లు అందిస్తామని కనుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వంశీ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వీ నాగమణి, ఆశాలు శ్రీదేవి, నందిని, పాఠశాల హెచ్ఎం ఏ ఇందిరా రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆరోగ్య సేవలు ప్రతి ఇంటికీ అందాలి

కంకిపాడు: ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు ప్రతి ఇంటికీ అందేలా చూడాలని ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు, నెప్పల్లి గ్రామాల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మద్దాలి రామచంద్రరావు మాట్లాడుతూ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై సర్వే నిర్వహించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆ గ్రామంలో నిర్వహించే వైద్య శిబిరం సమాచారాన్ని ప్రజలకు తెలియజేసి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వలంటీర్లు, గృహసారథులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ సేవలను ప్రతి ఇంటికీ అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పి. ఇందిర, ఎంపీటీసీ బూరగ బాలాజీ, ఈఓ బి.వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బిల్లా వెంకటేశ్వరరావు, నకరికంటి శేఖర్, కె.వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో నిర్వహించాలని బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని చెప్పారు. మహాత్మాగాంధీనగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంపై ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వారిద్దరూ మాట్లాడుతూ 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష మాట్లాడుతూ వలంటీర్లుతో కలిసి మెడికల్ సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేయాలని చెప్పారు. సర్వే పూర్తి వివరాలను వలంటీర్ల యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి రక్త నమూనాలను సేకరించాలని, ఆయా గ్రామాల్లో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రావడానికి టోకెన్లు అందించాలని డాక్టర్ మంజూష వివరించారు. సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, ఎంపీడీవో జోగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలపాలైన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు.. తోట్లవల్లూరు మండలం గరికపర్రు గ్రామానికి చెందిన వీరంకి శివకృష్ణ వ్యవసాయం చేస్తుంటాడు. ఈనెల 21న ద్విచక్రవాహనంపై విజయవాడ వెళ్తుండగా చలివేంద్రపాలెం నాగేంద్రస్వామి పుట్ట సమీపానికి చేరుకోగానే విజయవాడ నుంచి వస్తున్న ట్రక్కు ఆటో డ్రైవర్ వేగంగా వచ్చి ఢీకొనటంతో శివకృష్ణకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

కంకిపాడు: చోరీ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు.. ఈడుపుగల్లు బీసీ కాలనీకిచెందిన షేక్ రేష్మ ఇంటి వద్దే టైలరింగ్ చేస్తుంది. భర్త విజయవాడలో రెస్టారెంట్‌లో క్యాషియర్‌గా పనిచేస్తారు. జూలై 6న ఇల్లు మారే సమయంలో రేష్మ అక్క షేక్ వలీమా, చాందులు వచ్చి ఆటోలో సామగ్రి తరలించారు. ఆగస్టు 4న బీరువా తెరిచి చూడగా అందులో ఉండాల్సిన 16 గ్రాముల బంగారు నెక్లెస్, 15 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. ఈ విషయమై రేష్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన

గన్నవరం: పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగపద్మవతి తెలిపారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యాన పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. పద్మావతి మాట్లాడుతూ బాలికలు పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. అల్లాపురంలో డ్వాక్రా గ్రూప్రులకు అవగాహన కల్పించారు.

గౌరీ తనయా.. నమోస్తుతే



ఉయ్యూరు చింతలతోటలో అన్నసంతర్పణ ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని



ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహం వద్ద ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

ఉయ్యూరు: గణేష్ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వాడవాడలా కొలువుదీరిన గణనాథుడికి భక్తులు విశేష పూజలు, అన్నసంతర్పణలు చేసి భక్తిపారవశ్యం చెందుతున్నారు. ఏకదంతాయ, వక్రతుండాయ, గౌరీ తనయ నమోస్తుతే అంటూ ఉయ్యూరు చింతల తోటలో గణనాథుడికి శుక్రవారం వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. 3 వేల మందికిపైగా భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), నాయకులు షేక్ అబు కలాం, షేక్ ఖలీల్, వెంట్రప్రగడ బాజ్జీ అన్నంతర్పణను ప్రారంభించారు. ఉయ్యూరు పబ్లిక్‌స్కూల్ పాఠశాల ఆవరణలో ఎకో ఫ్రెండ్లీ వినాయకుడికి శివాలయం చైర్మన్ సీహెచ్ కుటుంబరాజు ప్రత్యేక పూజలు చేశారు. మట్టి వినాయక ప్రతిమలు చేసి నైపుణ్యత కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ ఎంకే బాబు, లయన్స్ క్లబ్ ట్రెజరర్ ఊర కిషోర్ పర్యవేక్షించారు. సాయిమహల్ సెంటర్, బస్టాండు సెంటరు, సుందరమ్మపేటలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో కోలాహలంగా వినాయక నిమజ్జనాలు జరిగాయి. రైవస్ కాలువ, బందరు కాలువల్లో భక్తులు గణనాథుడిని నిమజ్జనం చేశారు.

గన్నవరం: దావాజీగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం గణనాథుడికి 1,108 తామర పుష్పాలతో అర్చన చేశారు. అనంతరం సువాసినులతో కుంకుమార్చనలు జరిపారు. స్థానిక గౌడపేట, యాదవులపేట, రాయ్‌నగర్, రామ్‌నగర్, సగరపేట, అల్లాపురం, బుద్ధవరం, కేసరపల్లి గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌నగర్‌లో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాల్లో శుక్రవారం విశేష పూజలు, అన్నదానం చేశారు. బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఉప సర్పంచ్ దుట్టా శివనారాయణ, వార్డు సభ్యులు తాడిశెట్టి శ్రీను, పంజగల జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నాల లక్ష్మీ నారాయణ, నూకల బాలాజీ, అన్నం సత్యనారాయణ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన సుమారు 600 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాడీ బిల్డింగ్ క్రీడాకారుల రక్తదానం

పెనమలూరు: కానూరు అశోక్ జిమ్ బాడీబిల్డింగ్ క్రీడాకారులు రక్తదానం చేశారు. ఈ మేరకు బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి, మాతృహృదయ్ సేవా సంస్థ నిర్వహకుడు తాళ్లూరి అశోక్ శుక్రవారం వివరాలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో క్రీడాకారులు ఇమ్రాన్, జయంత్, బాలు, సింహా రక్తదానం చేశారన్నారు. గతంలో కూడా తమ క్రీడాకారులు రక్తదానం చేసి అనేక మంది ప్రాణాలు కాపాడారన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 24వ తేదీన విజయవాడ కేబీఎన్ కాలేజీలో జరిగే రక్తదాన కార్యక్రమంలో 25 మంది క్రీడాకారులు ప్రశంసా పత్రాలు అందుకోనున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూత్ అధికారులు సుంకరరాము, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఈదా రాజేష్, బి.మనోహర్ పలువురు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న క్రీడాకారులు

డ్రోన్ టెక్నాలజీపై దృష్టి పెట్టండి

పెనమలూరు: డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులు దృష్టి పెట్టాలని పుదుచ్చేరికి చెందిన యు కాన్ ఫ్లై యువర్ బ్యాకెర్స్ ఏరో మోడలింగ్ కంపెనీ సీఈవో జె.లక్ష్మీనారాయణన్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఇంట్రడక్షన్ టు డ్రోన్ టెక్నాలజీ అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రోన్ టెక్నాలజీతో పాటు మానవ రహిత వైమానిక విమానం (యూఏవీ) టెక్నాలజీ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్తులో మానవ రహిత విమానాలు, డ్రోన్‌ల ప్రాముఖ్యత పెరుగుతుందని వివరించారు. ప్రధానంగా భద్రతా రంగంలో మానవ రహిత విమానాల అవసరం ఆయా దేశాలకు బాగా పెరుగుతుందని అన్నారు. విద్యార్థులు ఏరో డైనమిక్స్, మెటీరియల్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై పట్టు సాధిస్తే మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గోపీ కుప్పారావు, కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, డీన్ ఆర్.సత్యప్రసాద్, ప్రొఫెసర్‌లు డాక్టర్ సుధీర్‌బాబు, ఎం.వంశీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న లక్ష్మీనారాయణన్

లోక్ జనశక్తి రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

రామవరప్పాడు: రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ (ఆర్ఎల్‌జేపీ) రాష్ట్ర, పలు జిల్లాల నూతన కార్యవర్గాలను శుక్రవారం రామవరప్పాడులోని రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చాగంటిపాటి జాన్‌వెస్లీ ఎన్నుకున్నారు. ఎంపికైన కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేశారు. రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌లుగా రాంబాబు, చాగంటిపాటి తారా, రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా బొడ్డు రాజేష్, యూత్ సెక్రటరీగా గోనా అశోక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అంబేడ్కర్, యూత్ జనరల్ జాయింట్ సెక్రటరీగా విశ్వేశ్వరరావును ఎంపికచేశారు. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుని నియామక పత్రాలు అందజేశారు.